
కథ



# ఇరుకు గదులు

-చల్లా రాంబాబు

ఉదయం ఏడైనా న్యూస్‌పేపర్ రాకపోవడంతో వరండాలో పచార్లు చేస్తున్నాడు రాజారావు. కాఫీ త్రాగుతూ పేపర్ చదువుతుంటే ప్రపంచాన్నొకసారి చుట్టి వచ్చినట్టుంటుందతనికి. అప్పుడే రోడ్డు మీద నుండి గాలిలో గిరిటీలు కొడుతూ తన ముందుకు వచ్చిపడింది పేపర్. ఆత్రంగా పేపర్‌ని తీసుకొని రోడ్డువైపు చూశాడు. అప్పటికే పేపర్‌బోయ్ సైకిల్‌ని ముందుకురికించాడు. 'వీడు లింబారామ్‌కి దగ్గర బంధువైవుంటాడు. ఆటలపోటీలో పేపర్ విసరడంలో ఛాంపియన్ అవడం ఖాయం' మనసులో అనుకున్నాడు రాజారావు. కుర్చీలో కూర్చొని పేపర్ చదవనారంభించాడు, భార్య అందించిన కాఫీ త్రాగుతూ.

ఇంటిలో ఓగదిలో నుండి--

"అమ్మా! సునీతా!" నీరసంగా వణుకుతూ పలికిందో ముసలిగొంతు.

"ఏమండీ! వినిపిస్తుందా! పేపర్ చదవడం మొదలెడితే పరిసరాల్నే మరచిపోతారు. మీ అమ్మగారు పిలుస్తున్నారు. నా కస్సలు ఖాళీ లేదు. ఈ రాలుగాయి పిల్లల్ని బడికి పంపేసరికే నాకు నీర్సం వస్తోంది. ఆఫీసుకు వెళ్లేలోపు మీకు వంటొకటి తగలెయ్యాలిగా! ఎందుకో ముసలావిడ మూలుగు మొదలైంది. కాస్త ఆమె బాధేంటో కనుక్కోండి" సునీత రుసరుసలాడుతున్నట్టు గ్రహించాడు రాజారావు. పేపర్ని టీపాయ్ మీద పెట్టి తల్లి ఉంటున్న గదిలోకెళ్లాడు. "ఏం కావాలమ్మా! కాఫీ త్రాగావా?" అడిగాడు తల్లిని రాజారావు.

"రాజా! నువ్వొచ్చావా! అవున్లే పాపం సునీతకు ఉదయం పనిలో తీరిక దొరకదు. ఏమీ లేదు నాయనా! రాత్రంతా అస్సలు నిద్రపట్టనే లేదు. కడుపులో పట్టి లాగినట్టు ఒకటే నొప్పి. తల నుండి మెడ వరకు ఒకటే నరాలు లాగేస్తున్నాయి. సునీతైతే కాస్త అమృతాంజనం రాస్తుందని పిలిచాను." లేవబోతూ అంది యశోదమ్మ.

"ఫరవాలేదు అలా పడుకో అమ్మా! నేను అమృతాంజనం రాస్తాను. కాస్త తగ్గుతుంది."

"వారంరోజుల్నుండి మాయదారి జ్వరం. దానికితోడు ఒళ్లంతా నొప్పులు. నీకు ఖాళీ అయినప్పుడు నన్ను కాస్త హాస్పిటల్‌కి తీసుకెళ్లు నాయనా! బాధ భరించలేకున్నాను."

వయసుపైబడ్డ కొద్దీ ఓ చిన్న కలతనైనా పెద్దదిగా భావించి చనిపోతామన్న ఆలోచనలకు గురవుతారు. అలాంటి భయమేదో యశోదమ్మను వేధిస్తోంది.

"ఇప్పటికి రెస్ట్ తీసుకో అమ్మా! రేపు ఆఫీసుకి శలవు పెట్టి హాస్పటల్‌కి తీసుకెళ్తాను" అన్నాడు రాజారావు ధైర్యం చెబుతూ.

కొడుకు చెయ్యి తగిలేసరికి సగం నెప్పి తగ్గినట్టనిపించింది యశోదమ్మకి. అవును మరి ఈ కొడుకుని పెంచుకోవడానికి భర్తనెంత బ్రతిమలాడిందని. యశోదమ్మకి ముప్పై సంవత్సరాల క్రితం సంఘటనలు మదిలో మెదిలాయి.

భర్తకు తనంటే ఎంతో ఇష్టం. ఏది కావాలన్నా క్షణాల్లో అమర్చేవాడు. వ్యాపారం చేసి జరుగుబాటుకు లోటు లేకుండా ఆస్తి సంపాదించాడు. కాని ఆడది ఆశించే మాతృత్వం మాత్రం పొందలేకపోయింది తను. అది తన చేతిలో పనికాదుగా! సంసారం సరదాగా గడిచిపోతున్నా పిల్లలు మసలని ఇల్లు బోసిగా అనిపించేది. ఎన్ని మందులు వాడిందని? ఎన్ని దేవుళ్లకు మ్రొక్కిందని? ఫలితం శూన్యం. గడిచేకాలాన్ని కొలుచుకోవడం తప్ప సంతానం లేని జీవితాన్ని తలచుకోలేకపోయింది. తన కడుపు పండదని ఖరాఖండీగా చెప్పారు డాక్టర్లు. తన మనసు నిండదని కలలో చెప్పారు దేవుళ్లు. చిగురించని చెట్టు నీడనిస్తుందా! వట్టిపోయిన ఆవు పాల నిస్తుందా! వ్యర్థమైన జీవతానికర్థం లేదనిపించింది. జీవితాన్ని అంతం చేసుకోబోయిన తనని భర్త అభ్యర్థన కట్టిపడేసింది. "నన్ను అన్యాయం చేసి పోవాలనుకున్నావా యశోదా! నువ్వు లేని జీవితం నాకెందుకు? ఇద్దరం కలిసికట్టుగా పోదాం" కంటనీరు పెట్టిన భర్తను చూసి చలించిపోయింది.

"అంతమాటనకండీ! మిమ్మల్ని అన్యాయం చెయ్యాలని కాదు. అమ్మా అని పిలిపించుకోలేని ఆడదాని బతుకు అడవిలోని మానుతో సమానం కదా! అందుకే జీవితం మీద విరక్తితో అలా చేయ తలపెట్టాను. ఇంకా ఎప్పుడూ ఆ ఆలోచనే రానివ్వను మనసులోకి. కాని నాదో చిన్నకోరిక కాదనన్నంటే అడుగుతాను" అంది వర్ధనమ్మ.


"అదేంటో చెప్పు" అన్నాడు భర్త.

"ఓ మగబిడ్డను పెంచుకుందాం. వంశం నిలుస్తుంది. అమ్మా అని పిలిపించుకోవాలనే ఆశ ఫలిస్తుంది." హృదయపు లోతుల్లోనుండి మాతృత్వం మమకారం పెల్లుబికింది.

"అలాగే చేద్దాం. కాని ఒక్కటి మాత్రం ఆలోచించు యశోదా! నీకప్పుడే ముప్పైఅయిదు సంవత్సరాలు నిండాయి. వయసుపైబడ్డ కొద్దీ ఓపిక సన్నగిల్లుతుంది. బిడ్డ ఆలనాపాలనా చూసుకోగలవా! నా సంగతి సరేసరి నీకు తెలిసిందేగా! మందులేని జబ్బు నన్ను పీడిస్తుందని. ఎప్పుడారిపోతుందో ఈ ఆయువు ఎవరికి తెలుసు?" భార్య తల నిమురుతూ అన్నాడు భర్త.

"అంత మాటనకండీ! మనం పెంచుకోబోయే బాబు పెళ్లి అచ్చట్లు ముద్దుముచ్చట్లు తీరాక మనం ఏమైపోయినా ఫరవాలేదు. నామాట కాదనకండి." తన నిర్ణయం మారలేదు. భర్త తీవ్రంగా ఆలోచించాడు. దగ్గర బంధువుల పిల్లాడిని పెంచుకుంటే ఆస్తికోసం వాడి మనసు విరిచేస్తారు. అందుకే అనాథశరణాలయంలోని మగబిడ్డను పెంచుకొన్నారు. కొడుకు ఆలనలో మునిగిపోయారు. యశోదమ్మ హృదయం ఉప్పొంగే గోదారిలా ఉరకలేసింది. ముఖం పూర్ణచంద్రబింబంలా వికసించింది. కాలమంతా కొడుకుతోనే గడిచిపోయేది. కొడుకు ముచ్చట్లు పూర్తిగా వినకుండానే కాలసర్పం కాటేసింది భర్తని. ఐనా ధైర్యం వీడక పెంచి పెద్దచేసి చదువు చెప్పించి కొడుకుని మంచి ఉద్యోగస్తున్ని చేయగలిగింది. తన ఆశయం నెరవేర్చుకుంది. అందుకే ఈ వయసులో కూడా అమ్మా అని పిలిపించుకుంటోంది.

"అమ్మా! నాకు ఆఫీసుకి టైమౌతోంది. తయారై వెళ్లాలి. మంచం మీద టాబ్లెట్లు పెట్టాను. తరవాత వేసుకో" అన్న రాజారావు



పిలుపుతో ఈలోకంలోకి వచ్చింది యశోదమ్మ.

"సునీతా! హాస్పిటల్‌లో రాత్రికి అమ్మ దగ్గరుండాలి త్వరగా వంట పూర్తిచేసి తెములు. నువ్వు హాస్పిటల్లో అమ్మని చూసుకుంటే నేను ఇంటి దగ్గర పిల్లల్ని చూసుకుంటాను" తల్లిని హాస్పిటల్‌లో అడ్మిట్‌చేసి వచ్చిన రాజారావు బట్టలు మార్చుకుంటూ అన్నాడు.

"నేనేమన్నా నర్స్‌ననుకున్నారా! ఆయాననుకున్నారా! హాస్పిటలంటేనే నాకు పరమ అసహ్యం. ఇలాంటి పనులు నాకు అప్పగించకండి. కావాలంటే పనిమనిషి రంగిని పంపించండి. అన్ని సేవలూ చేస్తుంది" స్కూల్ నుండి వచ్చిన పిల్లలకి బట్టలు మారుస్తూ అంది సునీత. చేసేది లేక గ్లాస్, కంచం, ఫ్లాస్క్, టవలు బెడ్‌షీట్ బేగ్‌లో సర్ది రింగికిచ్చి హాస్పిటల్‌కి పంపాడు రాజారావు.

వారంరోజులు గడిచిపోయాయి. యశోదమ్మ హాస్పిటల్‌లోనే ఉంది. నాలుగురోజుల్నుండి తల్లిని చూడ్డానికి వెళ్లలేదు రాజారావు.

"సునీతా! సునీతా! నిన్న బాంక్ నుండి డ్రా చేసిన ఇరవైవేల రూపాయలు నా పాంటుజేబులో పెట్టి అలాగే స్టాండుకి తగిలించి మరచిపోయాను. పాంటుజేబులో నుండి ఆ డబ్బు తీసి అలమారాలో పెట్టావా? మొన్న నువ్వు షాపులో చూసి కొనమన్న గోల్డ్‌నెక్లెస్ కోసం బాంక్ నుండి డబ్బు డ్రా చేశాను" ఆఫీసు నుండి వచ్చిన రాజారావు గాభరా పడుతున్నాడు.

"నాకు మీరు చెప్పలేదుగా! నాకేం తెలుసు! నేను చూడలేదే. అయినా నిన్న విడిచిన బట్టలన్నీ నర్సయ్యకేశాను ఉతకమని. మనింటి దగ్గరే ఉతికాడే! నాకే విషయం చెప్పలేదే" ఆశ్చర్యంగా అంది. సునీతకు అప్పుడే నర్సయ్యమీద అనుమానం మొలకెత్తింది.

"డబ్బుతోపాటు పాంట్ ఉతికేసుంటాడు. జేబులో ఉన్నాయేమో ఒకసారి చూడు" రాజారావు టెన్షన్ ఎక్కువైంది.

"ఇదిగోనండీ! ఈ క్రీంకలర్ పాంటే నిన్న వేసుకుంది. జేబులో ఏం లేదే. అయితే ఇదేదో నర్సయ్య పనే ఉంటుంది. వెంటనే వెళ్లి ఇంటికి పిలుచుకురండి ఏదో పనుందని. అక్కడే విషయం చెప్పారో చల్లగా జారుకుంటాడు" సులువు చెప్పింది సుజాత.

రాజారావు స్కూటరేసుకుని నర్సయ్యను తీసుకొచ్చాడు. భార్య ప్లాన్ ప్రకారమే.

"నర్సయ్యా! అయ్యగారు నిన్న విడిచిన క్రీమ్‌కలర్ పాంట్ జేబులో ఇరవైవేల రూపాయాలు పెట్టి మరచిపోయారట. నువ్వు ఉతికేటప్పుడు దొరికుండాలే. మరి నాతో చెప్పలేదేం?" గద్దించింది సుజాత.

"ఏంటండమ్మగారూ! అలాంటిదేం సూడనేదే. మీ ఇంటికాడేగదా బట్టలుతికినాను" ధైర్యంగా చెప్పాడు నర్సయ్య.

"నాకు ఊహ తెలిసినప్పటినుండి నువ్వు నీ భార్య రంగి మా ఇంట్లో పనిచేస్తున్నారు. ముందెప్పుడూ ఇలా జరగలేదు. ఇంట్లోకెవ్వరూ పైవాళ్లు రాలేదు. రంగి హాస్పిటల్‌లోనే ఉంది. నువ్వే బట్టలుతికావు. నిజం చెప్పు. నువ్వు తీసుంటావా డబ్బు" అజమాయిషీ చలాయిస్తూ అన్నాడు రాజారావు.

"లేదు బాబుగారు! నాకేం తెలీదు" అన్న సమాధానం వచ్చిందో నర్సయ్య చెంప ఛెళ్‌మనిపించాడు రాజారావు. నర్సయ్య కళ్లు బైర్లు కమ్మాయి. కోపంతో ఎర్రబడ్డాయి. అయినా తమాయించుకున్నాడు.

"బాబుగారు! మీరు పెద్దోళ్లు. ఎవరిమీదన్నా సెయ్యి సేసుకోగలరు. గాని నామూ అదే పన్జేస్తే మీ పరువేంగాను. అలా సెయ్యలేను బాబు. ఎందుకంటే ఆ డబ్బు నేనే తీసాను గనక. తీసుండకపోతే నేనూ అదేపని సేసుండోడ్ని" చెంపను చేత్తో తడుముకుంటూ అన్నాడు నర్సయ్య.

"దెబ్బకి దయ్యం జడుస్తుంది. దెబ్బ పడితేగాని నిజం కక్కలేదు. ఆ డబ్బు జేబులో దొరికినప్పుడే అమ్మగారి కెందుకివ్వలేదు? ముందు నాకు తెలియదని అబద్ధం చెప్తావా. అంటే అంత డబ్బు చూడగానే నీ బుద్ధి వక్రించిందన్నమాట. దొంగతనానికి పూనుకున్నావ్. వెంటనే తెచ్చిస్తావా! పోలీసులకి ఫోన్ చెయ్యమంటావా?" రాజారావు ఉగ్రుడయ్యాడు.

"ఆ డబ్బు నాదగ్గిర లేదు బాబూ! పోలీసోళ్లకి ఫోన్ చెయ్యండి. గాని ఆళ్లకి ఫోన్ చేసేముందు నాను సెప్పింది సొంతం ఇనండి. పెద్దమ్మగార్ని సూడ్డానికి మొన్న ఆసపత్రికెళ్లాను బాబూ! పావం అమ్మగారు మంచంమీద బాధతో అవసోపాలు పడుతున్నారు. అమ్మగారికెలాగుంది డాక్టరుగారు ఏవన్నారని మా రంగినడిగాను. దాని మొఖం అదేటి సెప్పుద్ది బాబూ! ఏటోనయ్యా రోజురోజుకీ పెద్దమ్మగారి పరిస్థితేం బాగా లేదు అంది. నానెళ్లి పెద్దనర్సమ్మ నడిగాను. మాపెద్దమ్మగారికి నయం అవుద్దానని. దానికా నర్సమ్మ ఏటందో తెలుసాబాబు! ఆయమ్మకి ఆపరేషన్ సేత్తే బాగుపడద్దటగాని ఆయమ్మ కొడుకు, కోడలు ఆసపత్రికోసారి వచ్చినప్పుడు ఇసయం సెప్పి ఇరవైవేల దాకా ఖర్చవుద్దని డాకటరుగారు అన్నారు. అంత కరుసు పెట్టుకోలేం అని సెపి ఆ ఆయమ్మ ఆకరిదశవరకూ ఆసపత్రిలోనే ఉంచేయ లన్నారట. ఆ ఇసయం నర్సమ్మ సెప్పగానే నా గుండెలో దొలిసనట్టనిపించింది. ఈ ఇసయం నా రంగికి గూడ సెప్పనేక నేత్రాల్లో నీరు తిప్పుకుంటూ ఇంటికొచ్చేసినానేగాని ఆ రాత్రికాడ నిద్రపట్టనేదు. అయినా కూలోడ్ని నానేటి సెయ్యగలను? తెల్లారి మీ బట్టలుతుకుదావని సూసేసరికి పేంట్‌జేబులో డబ్బును సూడగానే గుభల్‌మన్నాది నా గుండె. ఎంటనే అమ్మగారిని



పిలిచి ఇచ్చేద్దామని ఒకడుగు ముందుకేసినా మనసుమాత్రం ఎనక్కి లాగింది. 'నర్సయ్యా మీ పెద్దమ్మగారి రుణం తీర్చుకోడానికి నీకు సమయం సిక్కింది' అని ఎగదోసింది. అంతేనయ్యా బట్టలుతికేసి ఆసుపత్రి కెల్లి మా అయ్యగారు అరజంటుగా కేంపుకెల్లారు. ఈ సొమ్ము కట్టేయమన్నారు. అమ్మగారికి ఆపరేసన్ సేసేయమన్నారని సెప్పాను బాబూ. దానికి ఆ డాకటర్‌బాబు 'సమయానికి డబ్బు కట్టారు. ఈ రోజు ఆపరేషన్ సెయ్యకపోతే పేసెంట్ దక్కపోయుండేదని సెప్పారు. ఈపాటికి ఆపరేషన్ అయిపోయుంటాది బాబు' చెక్కిళ్లపై జారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ అన్నాడు నర్సయ్య.

"మా డబ్బు దొంగిలించి హాస్పటల్లో కట్టడానికి నువ్వెవడివిరా?" ఉగ్రతాండవ మాడుతూ అంది సునీత. రాజారావు నోట మాట పెగలడంలేదు.

"సినబాబుగారిని పెంచుకోకముందు నుండే రంగి నేను పెద్దయ్యగారి దగ్గిర పనిలో కుదిరినాం అమ్మా! ఈ బాబుని పెద్దమ్మగారు సేతుల మీదే నడిపించేఓరు. కింద నడిస్తే కాలు కందిపోతాయని. నా భుజాల కెక్కించుకొని భుజాలరిగిపోయినట్టు అయ్యగార్ని తిప్పి ఆడించాను. పెట్టిన సెయ్యిని నరికే రకం కావమ్మా మా బతుకులు. అవసరమైతే మాపేనాలు కోసెడతాంగాని ఎవరికైనా పానాలు పోతుంటే సూత్తా ఊరుకోలేం. పెద్దమ్మగారు దేవుడితో సమానం. మనసు ఎన్నముద్దలాంటిది. చిన్నయ్యగారు మిమ్మల్ని పెళ్లాడతానని పట్టుబట్టినప్పుడు మీ పెద్దోళ్లేమన్నారో తెలుసా అమ్మా! ఆస్తంతా సిన్నయ్యగోరి పేర రాసిస్తేగాని పిల్లనివ్వనన్నారు. తనకంటూ ఏటీ ఉంచుకోకండ ఆస్తంతా సిన్నయ్యగారికే రాసిచ్చేసిందాయమ్మ. అలాంటమ్మ మంచాన్న పడితే జబ్బు నయం సెయ్యడానికి డబ్బు కరువైపోవద్దని, ఆయమ్మ కింత సెయ్యబడతాదని అలాగే కడతేరిపొమ్మన్నారు. మీ గుండెలు బండరాళ్లు, బతుకులు బలుసుముళ్లు. మీరు పెద్దపెద్ద భవంతుల్లో ఉన్నా మీ మనసులు మాత్రం యిరుకుగదులు. మేం ఉండేవి యిరుకుగదులైనా సంద్రంలాగ ఇసాలమైన మనసులు మావి. ఈ ఇనయం తెలుసుకో అమ్మా! బాబూ సినబాబుగారూ! నాను దొంగతనం సేసినాని ఒప్పేసుకున్నాను గదా. పోలీసోల్ని పిలవండి. నాకు బేడీలు ఏయించండి. నా జీవితమంతా తవరికింద సేవలు సేసినందుకు తగిన సిచ్చ ఏయించండి బాబూ! మీ లాగుల కాడనుండి సూటులదాకా ఉతికిన ఈ నర్సిగాడికి సిచ్చ ఏయించండి" నర్సయ్య విలపిస్తూ కూలబడ్డాడు.

ఆకాశమంత వ్యక్తిత్వంగల నర్సయ్య ముందు రాజారావు చిన్నగడ్డిపోచగా తోచాడు. అతని విశ్వాసం, సేవాతత్పరత ముందు తనో స్వార్థసంకుచిత పరమాణువు. హాస్పిటల్‌లో ఓ రోజు తల్లిని చూడ్డానికి వచ్చిన తనతో సునీత చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. "చూడండీ! మీ అమ్మగారికి ఆపరేషన్‌కి ఇరవైవేలు ఖర్చువుతుందన్నారు. ఇంకా టెస్ట్‌లకని బెడ్‌చార్జీలకని వీటికని వాటికని ఏ యాభై వేల వరకూ గుంజేస్తారు. నేడోరేపో పోవాల్సిన ముసలావిడని వేలకు వేలు పోసి బతికించుకున్నా సేవలు చేస్తూనే ఉండాలి. మన పిల్లల భవిష్యత్తు ఆలోచించండి. ఇలాగే ఖర్చులు చేసుకుంటూ పోతే ఆస్తి హారతికర్పూరంలా కరిగిపోతుంది. ఇంటి దగ్గరున్నా ఆవిడగారికి సేవలు చేయడానికి నాకు కుదరదు. మీకా ఆఫీసుపని. ఇక్కడే ఉంచేస్తే ఎలా జరగవలసింది అలా జరుగుతుంది" భార్య మాటలకు తలొంచి తల్లిని నిర్లక్ష్యం చేసిన తనని దేవుడు కూడా క్షమించడు" రాజారావు మథన పడసాగాడు.

"మనమేదో తప్పు చేసినట్టు వాడన్నన్ని మాటలంటుంటే బెల్లం కొట్టిన రాయిలా పలకరేంటండీ" అంది సునీత భర్తనుద్దేశించి.

ఆమెమాట పూర్తికాకముందే సునీత చెంప ఛెళ్‌మంది. ఊహించని ఆ పరిణామానికి విస్తుపోయింది.

"ఇదంతా నీనుండే జరిగింది. అయినా నిన్ననేం లాభం. నువ్వన్న ప్రతీమాటకు గంగిరెద్దులా తలూపే నాకు ఆ దేవుడే శిక్ష విధించాడు. నీ మాటలు విని దైవం లాంటి తల్లిని పోగొట్టుకొనేవాడినే" అని "నర్సయ్యా! నన్ను క్షమించు. ముందు అమ్మని చూద్దాం పద" నర్సయ్యని స్కూటర్‌పై తీసుకొని హాస్పిటల్‌కి వెళ్లాడు రాజారావు.

ఆపరేషన్ అయ్యాక బెడ్‌పై పడుకున్న యశోదమ్మ అప్పుడే నెమ్మదిగా కళ్లు తెరిచింది. బెడ్ పక్కనే నిల్చున్న రాజారావుని చూసింది "రాజా! నువ్వు ఆఫీసు పనిమీద కేంపుకెళ్లావటగా! నర్సయ్య చెప్పాడు. సమయానికి డబ్బిచ్చి పంపావు. నిన్ను కనకపోయినా పెంచినందుకు రుణం తీర్చుకున్నావు నాయనా! స్వర్గంలోనున్న మీనాన్న సంతోషిస్తాడ్రా! అవునూ సునీత ఏదీ! రాలేదా! అవున్లే పాపం పిల్లలతో తనకెలా అవుతుంది? వాళ్లసలే అల్లరిపిల్లలు" కొడుకుని చూసిన సంతోషంతో చెప్పుకుపోతోంది యశోదమ్మ.

నిర్మల హృదయురాలైన తల్లికెలా చెప్పగలడు తనో విశ్వాసఘాతకుడనని. తల్లి చేతులు పట్టుకొని రెండు కన్నీటిబొట్లు రాల్చడం తప్ప. ■

